
7

సాక్షి
విశాఖపట్నం

బుధవారం, 24, సెప్టెంబర్, 2025



75 కేసుల్లో 103 మంది నిందితుల అరెస్ట్

- 557.392 గ్రాముల బంగారం, రూ.5.7 లక్షలు స్వాధీనం
- మొత్తంగా 1.21 కోట్ల విలువైన సొత్తు రికవరీ



బాధితురాలికి సొత్తు అందజేస్తున్న సీపీ

విశాఖ సిటీ : నగరంలో నేరాల నియంత్రణకు చేపట్టిన చర్యలు సత్ఫలితాన్నిస్తున్నాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు నెలలో నగరంలో 105 చోరీ కేసులు నమోదైనట్లు తెలిపారు. వీటిలో 75 కేసులు ఛేదించి 103 మంది నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రూ.5,70,500 , 557.392 గ్రాముల బంగారం, 18 బైక్‌లు, 423 మొబైల్ ఫోన్లు, ఇతర వస్తువులు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మొత్తంగా రూ.1,21,24,953 విలువైన సొత్తును రికవరీ చేశామన్నారు. నేర నియంత్రణలో భాగంగా ఆగస్టులో నగరంలో 247 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో రాత్రి, పగలు ప్రత్యేకంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోలీసులు రికవరీ చేసిన సొత్తు, వస్తువులను సీపీ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. సమావేశంలో డీసీపీ(క్రైమ్) లతామాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ జేడీగా శంకరరావు



ఆరిలోవ: విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డెరెక్టర్‌గా డాక్టర్ దేవులపల్లి శంకరరావు బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఇంతవరకు పనిచేసిన ఆయనకు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఇంతవరకు ఇక్కడ స్పైమల్ విభాగానికి చెందిన డాక్టర్ కరుణాకరరావు జేడీ(ఎఫ్ఏసీ)గా పనిచేసి సోమవారం రిలీవై డాక్టర్ శంకరరావుకు బాధ్యతలు అప్పగించారు.

చిరు వ్యాపారులపై కూటమి కక్ష

- బడ్డీల తొలగింపుతో రోడ్డున పడ్డ వేలాది కుటుంబాలు
- నష్టపరిహారంతోపాటు బడ్డీలకు అనుమతులు ఇవ్వాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు డిమాండ్
- చిరు వ్యాపారులకు అండగా వైఎస్సార్ సీపీ భారీ ర్యాలీ



ఏడీసీ రమణ మూర్తికి వినతి అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, సమన్వయకర్తలు, మళ్ల విజయప్రసాద్, మొల్లి అప్పారావు, దేవన్ రెడ్డి, తైనాల విజయ కుమార్, జాన్ వెస్లీ, కొండా రాజీవ్ గాంధీ తదితరులు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, సమన్వయకర్తలు, మళ్ల విజయప్రసాద్, మొల్లి అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, పార్టీ నాయకులు, చిరు వ్యాపారులు

బీచ్‌రోడ్డు : చిరు వ్యాపారుల పట్ల కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, కనీసం నోటీసులు ఇవ్వకుండా వారి దుకాణాలను తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తోపుడు బళ్లు, బడ్డీల తొలగింపును నిరసిస్తూ జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, హాకర్లతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ వద్ద ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు విఫలయత్నం చేశారు. అయినా వైఎస్సార్ సీపీ శ్రేణులు, హాకర్లు తమ ఆందోళనను కొనసాగించారు. ర్యాలీ అనంతరం బడ్డీలు, తోపుడు బళ్ల వ్యాపారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ జీవీఎంసీ అదనపు కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మీడియాతో మాట్లాడుతూ గతంలో ట్రేడ్ లైసెన్స్, విద్యుత్ మీటర్ కనెక్షన్ ఇచ్చి హాకర్ జోన్లలో వ్యాపారాలను ప్రోత్సహించిన ఇదే జీవీఎంసీ అధికారులు ప్రభుత్వం మారగానే కుట్ర పూరితంగా దుకాణాలను తొలగించడం దుర్మార్గమన్నారు. జీవీఎంసీ అధికారుల దాడుల్లో దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు తక్షణం నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే మేయర్, ఎంపీ, కూటమి ఎమ్మెల్యేలను బయట తిరగనివ్వమని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన వైఎస్సార్ సీపీ పోరాడుతుందన్నారు.

నాడు అనుమతులిచ్చి నేడు కూల్చేస్తారా..?

చిరు వ్యాపారాలకు ప్రత్యామ్నాయం చూపించకుండా ఉన్నపళంగా దుకాణాలు కూల్చివేస్తే ఎలా?.. వారు ఎక్కడికి పోవాలి? కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆయన ప్రశ్నించారు. గతంలో ఉన్న జీవీఎంసీ కమిషనర్లే హాకర్ జోన్ల పేరుతో స్థలాలు కేటాయించి నంబరింగ్, ట్రేడ్ లైసెన్స్ ఇచ్చి వ్యాపారాలను ప్రోత్సహిస్తే ఇప్పుడు ఉన్న కమిషనర్ కర్కశంగా వాటిని తొలగించేశారన్నారు.

రోడ్డున పడ్డ 40 వేల కుటుంబాలు

ప్రభుత్వం తీసుకున్న ఈ అనాలోచిత నిర్ణయం కారణంగా నగరంలో దాదాపు 40 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. డైలీ ఫైనాన్స్, ముద్ర లోన్స్ తీసుకొని వ్యాపారులు చేసుకుంటున్న వారంతా ఇప్పుడు లోన్లు కట్టేదారి లేక అల్లాడిపోతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బాధితులందరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

చేతనైతే భూ కబ్జాలను అడ్డుకోండి..

కూటమి ప్రభుత్వానికి చేతనైతే నగరంలో బడాబాబులు చేస్తున్న అక్రమ నిర్మాణాలు, భూ కబ్జాలను అడ్డుకోవాలని కానీప రెక్కాడితే గానీ డొక్కాడని చిరువ్యాపారులపై విరుచుకుపడటం దుర్మార్గమన్నారు. ఓటేసి గెలిపించిన ప్రజలను క్షోభకు గురిచేయడం సరికాదన్నారు. కూటమి ఎమ్మెల్యేలు చిరు వ్యాపారులకు క్షమాపణలు చెప్పి వారి దుకాణాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విశాఖను పణంగా పెడుతున్నారు..

విశాఖ అభివృద్ధి చెందితే అమరావతికి పెట్టుబడులు రావనే ఆలోచనతో కుట్రపూరితంగా నిత్యం నగరంలో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని కె.కె.రాజు ఆరోపించారు. పారిశ్రామికవేత్తలను ఇక్కడ నుంచి వెనక్కి పంపే కుట్ర జరుగుతోందన్నారు. ఇక్కడి సంపదను అమరావతికి తరలించుకుపోతున్నారన్నారు. ఇక్కడి భూములను తనఖా పెట్టి బ్యాంకు లోన్లు తీసుకుని అమరావతిలో పెట్టుబడులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు మళ్ల విజయప్రసాద్, తిప్పల దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు జాన్ వెస్లీ, పేర్ల విజయచంద్ర, పార్టీ సీనియర్ నాయకులు రొంగలి జగన్నాథం, డాక్టర్ జహీర్ అహ్మద్, గొలగాని శ్రీనివాస్, పిన్నమరాజు సతీష్ వర్మ, నడింపల్లి కృష్ణంరాజు, కటారి అనిల్‌కుమార్‌రాజు, అల్లు శంకర్‌రావు, ద్రోణంరాజు శ్రీవాస్తవ, రవి రాజు, పల్లా చినతల్లి, అల్లంపల్లి రాజబాబు, రామన్న పాత్రుడు, జోనల్ అనుబంధ విభాగాల అధ్యక్షులు అంబటి శైలేష్, నీలపు కాళిదాస్ రెడ్డి, ముత్తి సునీల్ కుమార్, తుమ్మలూరు జగదీష్ రెడ్డి, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు సకలభక్తుల ప్రసాద్‌రావు, సనపల రవీంద్ర భరత్, బోని శివ రామకృష్ణ, పీలా ప్రేమకిరణ్ జగదీష్, రామి రెడ్డి, వంకాయల మారుతీ ప్రసాద్, బోండా ఉమామహేశ్వరరావు, జీలకర్ర నాగేంద్ర, నీలి రవి, దేవరకొండ మార్కెండేయులు, కార్పొరేటర్ గులివిందల లావణ్య, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు, చిరువ్యాపారులు పాల్గొన్నారు.



జీవీఎంసీ ప్రధాన కార్యాలయం గేట్ వద్ద నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

కూటమి ప్రభుత్వం ముంచేసింది



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిరు వ్యాపారాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ చేదోడు, చేయూత పథకాలు అమలు చేస్తే కూటమి ప్రభుత్వం మా బతుకులను బజారుకీడ్చింది. సీతమ్మధారలో కొన్నాళ్లుగా నిర్వహిస్తున్న టిఫిన్ షాపును తొలగించటంతో కుటుంబ పోషణ ప్రశ్నార్థకంగా మారింది.

– నారాయణ రావు, టిఫిన్ షాపు, సీతమ్మధార

రోడ్డున పడ్డాం..



నా భార్య, కుమారుడు దివ్యాంగులు. కుటుంబమంతా కలిసి పకోడీ షాపు ద్వారా జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు షాపు తొలగించడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఇంటి అద్దె, కుటుంబ పోషణకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. కూటమి ప్రభుత్వం చర్యలతో వీధినపడ్డాం.

– వెంకట రమణ, పకోడి షాపు, కృష్ణకాలేజ్ రోడ్డు

వృద్ధాప్యంలో ఇన్ని కష్టాలా?



గత 30 ఏళ్లగా కూరగాయాల వ్యాపారం చేసుకుంటూ ఒంటరి జీవితం కొనసాగిస్తున్నా. దుకాణాలు తొలగింపుతో జీవనాధారం లేకుండా పోయింది. ఈ వయసులో ఇతర పనులకు వెళ్లాలేని పరిస్థితి. ఎలా బతకాలో ఆందోళనగా ఉంది. ప్రభుత్వం చిరు వ్యాపారులను ఆర్థికంగా దెబ్బతీసింది.

– ఎల్లాయ్యమ్మ, వృద్ధురాలు, దొండపర్తి

పాలనలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కీలకం

- లేఖలు, నివేదికల తయారీలో పెరిగిన ఏఐ వినియోగం
- కేంద్ర సమాచార కమిషన్ కార్యదర్శి రష్మిచౌదరి
- ముగిసిన 28వ జాతీయ ఈ-గవర్నెన్స్-2025 సదస్సు



ప్రసంగిస్తున్న కేంద్ర సమాచార కమిషన్ కార్యదర్శి రష్మిచౌదరి



డిక్లరేషన్ విడుదల చేస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, ఐఐపీఏ డీజీ ఎస్.ఎన్.త్రిపాఠి, డీఏఆర్‌పీజీ కార్యదర్శి వి.శ్రీనివాస్, డీఏఆర్‌పీజీ అదనపు కార్యదర్శి పునీత్ యాదవ్, డీఏఆర్‌పీజీ సంయుక్త కార్యదర్శి సరితా చౌహాన్

విశాఖ సిటీ : ప్రజల కేంద్రీకృతంగా సమర్థవంతమైన పాలన అందించడంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కీలక భూమిక పోషిస్తుందని కేంద్ర సమాచార కమిషన్ కార్యదర్శి రష్మిచౌదరి పేర్కొన్నారు. 28వ జాతీయ ఈ-గవర్నెన్స్-2025 సదస్సు రెండో రోజు నోవోటెల్ హోటల్‌లో జరిగింది. ముందుగా 'సివిల్ సర్వీస్-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే అంశంపై ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రష్మిచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ పాలసీ విధానాల రూపకల్పన నుంచి పట్టణ ప్రణాళిక, వరద పర్యవేక్షణలో అనేక డిజిటల్ ప్లాట్‌ఫారాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వెల్లడించారు. లేఖలు, నివేదికల తయారీలో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిందని వివరించారు. రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు.ఎ మాట్లాడుతూ విధానాల తయారీ, అమలు, వ్యవస్థల నడిపించే విషయంలో సివిల్ సర్వెంట్స్ పాత్రను వివరించారు. ఎన్నికల ప్రక్రియలో ఆధార్ సీడింగ్, నగదు రహిత ప్రజా పంపిణీ వ్యవస్థల అమలు, డిజిటల్ చెల్లింపుల స్వీకరణ, ప్రజా సాధికార పల్స్ సర్వే, కృష్ణా పుష్కరాల సమయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని విశదీకరించారు.

2026–27 నాటికి 11 కోట్ల రైతులకు గుర్తింపుకార్డులు

అగ్రిస్టాక్-డిజిటల్ సొల్యూషన్ ఫర్ అగ్రికల్చర్ అనే అంశంపై జరిగిన మరో ప్లీనరీలో కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది (వర్చువల్) మాట్లాడుతూ 2026–27 నాటికి 11 కోట్ల రైతులకు డిజిటల్ గుర్తింపుకార్డులు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా రైతుల సమగ్ర సమాచారం, వారి ఆధార్ లింకేజ్, భూయాజమాన్య రికార్డులు, మ్యుటేషన్లు, పంట పొలాల ఫొటోలు, జియోట్యాగ్‌లతో జాతీయ స్థాయిలో కచ్చితమైన పంటల రికార్డులను నమోదు చేయనున్నట్లు చెప్పారు.

వాట్సాప్ గవర్నెన్స్‌తో 710 సేవలు

రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ జీఎస్‌డబ్ల్యూఎస్, రియల్ టైమ్ గవర్నెన్స్ విభాగాలు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైనవన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభతరంగా అందించేందుకు వాట్సాప్ గవర్నెన్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. వాట్సాప్ డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా 40కి పైగా విభాగాలకు చెందిన 710 సేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు. రాష్ట్ర రియల్ టైమ్ గవర్నెన్స్ సీఈవో ప్రఖార్ జైన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సీసీటీవీ నిఘా వ్యవస్థలపై మాట్లాడారు. ప్రభుత్వం 2017లో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్, రెడ్-లైట్ ఉల్లంఘనలను గుర్తించేందుకు 14,770 కెమెరాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందన్నారు. వీటిపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ, సమన్వయం లేకపోవడంతో సవాళ్లు ఎదురవుతున్నాయని, వీటిని పరిష్కరించడానికి స్మార్ట్ పోలీసింగ్, గవర్నెన్స్ కోసం 300 అధునాతన కెమెరాలు, 38 అనలిటిక్స్ సాధనాలతో ఏఐని అనుసంధానం చేసినట్లు చెప్పారు. అనంతరం సదస్సులో చర్చించిన 11 అంశాలతో రూపొందించిన డిక్లరేషన్‌కు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట

- 26 నుంచి సమ్మెలోకి..
- డీఎంహెచ్‌వోకు నోటీసు అందజేసిన వైద్యులు



డీఎంహెచ్‌వోకి సమ్మె నోటీసు ఇస్తున్న ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు

మహారాణిపేట : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మెకు సన్నద్ధమయ్యారు. ఈ నెల 25లోగా తమ డిమాండ్లు నెరవేర్చకపోతే 26 నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌కు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావుకు సమ్మె నోటీసులు అందజేశారు. చాలా మంది వైద్యులు పదోన్నతులు లేకుండానే పదవీ విరమణ చేస్తున్నారని సకాలంలో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇన్-సర్వీస్ పీజీ కోటాను తిరిగి పునరుద్ధరించాలని, ఎస్టీ ఏరియాల్లో పనిచేస్తున్న వారికి బేసిక్ పేపై 50శాతం ట్రైబల్ అలవెన్స్ ఇవ్వాలని, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమంలో పనిచేస్తున్న వారికి రూ.5 వేల అలవెన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ ఇంక్రిమెంట్లను తదితర సమస్యలపై అనేక వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సమ్మె తప్పడం లేదని అసోసియేషన్ నాయకులు డాక్టర్ జగదీష్ పేర్కొన్నారు.

గజ్జె ఘల్లుమన్నది.. జానపదం వెల్లివిరిసింది



గజ్జఘల్లుమన్నది...జానపదం వెల్లివిరిసింది. ఆంధ్రవిశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న రెండు రోజుల యువజనోత్సవంలో విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. మంగళవారం నిర్వహించిన నృత్య పోటీలకు పెద్దసంఖ్యలో యువత పోటీ పడ్డారు. శాస్త్రీయ, జానపద నృత్యాలతో తమ ప్రతిభను చాటారు. అధిక శాతం మంది గ్రామీణనేపథ్యం కలిగిన జానపద నృత్యాలను ప్రదర్శించడానికి ఆసక్తి చూపారు. బృందాలుగా వీరు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. యువత ముందుగా ఎన్ఎస్ఎస్ కార్యాలయం ఎదురుగా ఉన్న రహదారిపై తమ నృత్యం సాధన చేశారు.

-ఫొటోలు : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం





వరల్డ్ మెగా మారథాన్ పూర్తిచేసిన కల్యాణ్



బీచ్‌రోడ్డు: ఇండియన్ స్కేటింగ్ మాజీ కోచ్, జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించిన కూరపాటి కల్యాణ్(54) జర్మనీలోని బెర్లిన్ నగరంలో జరిగిన వరల్డ్ మెగా మారథాన్‌లో పాల్గొని, పతకం సాధించారు. రాష్ట్రం తరపున ఎంపికైన ఆయన ఈ నెల 20న జరిగిన ఇన్‌లైన్ స్పీడ్‌లో 42 కిలోమీటర్లు, 21న 42 కిలోమీటర్ల మారథాన్ పరుగు సకాలంలో పూర్తిచేశారు. ప్రపంచ వ్యాప్తంగా 181 దేశాల నుంచి 80 వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో 8 వేల మంది విజేతలుగా నిలిచారు. విశాఖ వుడాపార్క్‌లో కోచ్‌గా ఉంటూ వేలాది మందిని స్కేటింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దారు. కల్యాణ్ రోలర్ స్పోర్ట్స్ అకాడమీ స్థాపకులు. విశాఖ డిస్ట్రిక్ట్ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌చంద్ర, ఉపాధ్యక్షుడు కరణం గంగాధర్, జాయింట్ సెక్రటరీ రాజ్‌కుమార్, కోచ్‌లు, విద్యార్థులు, తల్లిదండ్రులు కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు.

అంపశయ్యపై.. అపర సంజీవని



- మూగబోతున్న కుయ్.. కుయ్.. సేవలు
- ప్రజాసేవకు దూరంగా 108 వాహనాలు
- రోడ్డు ప్రమాదాల సమయాల్లో అలసత్వంగా వస్తున్న వైనం
- తరచూ మరమ్మతులు, బ్రేక్ డౌన్లు అవుతున్న వాహనాలు

మహారాణిపేట : రోడ్డు ప్రమాదాలు, తీవ్ర అనారోగ్యాలు, పురిటి నొప్పులు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడే సంజీవనిగా పేరుగాంచిన 108 అంబులెన్స్ సేవలు ఇప్పుడు కష్టాల్లో కూరుకుపోయాయి. సకాలంలో అంబులెన్స్ అందుబాటులోకి రాకపోవడంతో రోగులు, క్షతగాత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఫోన్ చేసిన 15 నిమిషాల్లోనే వచ్చే అంబులెన్స్‌లు ఇప్పుడు మరమ్మతులు కారణంగా ఆలస్యమవుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన ఈ సేవలు, ఇప్పుడు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో కూడా సమస్యలు మరీ ఎక్కువయ్యాయి.

వైఎస్సార్ కలల పథకం 108

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి 2005లో 108 అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. 'కుయ్... కుయ్' అనే సైరన్ వినగానే వైఎస్సార్ గుర్తుకు వస్తారంటే అతిశయోక్తి కాదు. ఈ సేవలు వేలాది మంది ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించాయి.

వై.ఎస్. జగన్ హయాంలో బలోపేతం

2019లో అధికారంలోకి వచ్చిన వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి 108 వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. ఒకేసారి 1,088 కొత్త అంబులెన్స్‌లను ప్రారంభించి, ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ ఉండేలా చూశారు. పట్టణాల్లో 15 నిమిషాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాల్లో, గిరిజన ప్రాంతాల్లో 30 నిమిషాల్లో అంబులెన్స్ చేరేలా సమయపాలన నిర్ధారించారు. ప్రతి అంబులెన్స్‌ను ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్‌తో అనుసంధానం చేసి, ఫోన్ చేసిన వారిని వేగంగా ట్రాక్ చేసేలా అధునాతన సాంకేతికతను ఏర్పాటు చేశారు. ఈ అంబులెన్స్‌లలో కెమెరా, మొబైల్ డేటా టెర్మినల్, ఆటోమెటిక్ వెహికల్ లొకేషన్ టాండ్ బాక్స్ వంటి సౌకర్యాలు కల్పించారు.

కరోనా సమయంలో కీలక సేవలు

2020–21లో కరోనా మహమ్మారి సమయంలో, 108 అంబులెన్స్‌లు వేలాది మంది ప్రాణాలు కాపాడటంలో ప్రధాన పాత్ర పోషించాయి. అంతేకాకుండా, రోడ్డు ప్రమాద బాధితులు, గర్భిణులు, నవజాత శిశువులు, పాము కాటుకు గురైన వారు, విష ప్రయోగం వంటి అనేక సందర్భాల్లో ఈ అంబులెన్సులు ప్రజలకు సేవలు అందించాయి.

కొత్త కాంట్రాక్టర్‌తో సమస్యలు

ఆంధ్రప్రదేశ్‌లో 2020 జూలై 1 నుంచి అరబిందో ఎమర్జెన్సీ సర్వీసెస్ ఆధ్వర్యం లో నడిచిన 108 సేవలు, ఆ కాంట్రాక్ట్ గడువు మే 31తో ముగిసింది. జూన్ 1 నుంచి భవ్య హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఈ సేవలు కొనసాగుతున్నాయి. జిల్లాకు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ వ్యవస్థ కలిగిన 108 వాహనాలను కేటాయించారు. అయితే మరమ్మతులకు గురైన వాహనాలను సకాలంలో రిపేర్ చేయకపోవడంతో సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ అత్యవసర సేవలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

విశాఖలో 108 వాహనాలు

విశాఖలో 16 అంబులెన్స్‌లు ఉన్నాయి. ఇందులో అంబులెన్స్ రిజర్వు ఉంచుతారు. ఏదైనా మరమ్మతులకు గురైతే దాని స్థానంలో ఈ అంబులెన్స్ పంపుతారు.

సేవలలో జాప్యం

అత్యవసర పరిస్థితుల్లో పేదలకు ప్రాణదాత అయిన 108 అంబులెన్స్ సేవలు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. వాహనాలు తరచూ మరమ్మత్తులకు గురవుతుండటం, వాటిని సకాలంలో రిపేర్ చేయకపోవడంతో సేవల్లో జాప్యం జరుగుతోంది. ఫోన్ చేసిన చాలా సమయం తర్వాత కూడా అంబులెన్స్ అందుబాటులోకి రావడం లేదు. దీంతో రోడ్డు ప్రమాద బాధితులు, రోగులు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. వాహనాలకు చిన్నపాటి రిపేర్లు వచ్చినా, వాటిని మరమ్మతులు చేయడానికి ఎక్కువ సమయం పడుతోంది. దీనివల్ల చాలా అంబులెన్స్‌లు సేవలకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. 108 సేవలు అందుబాటులో లేకపోవడంతో, పేదలు అత్యవసర పరిస్థితుల్లో ఆటోలు లేదా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇది వారి జేబులకు చిల్లు పెడుతోంది. వర్షాల కారణంగా అంటువ్యాధులు పెరిగిన ఈ సమయంలో, ప్రజలు ఆస్పత్రులకు వెళ్లడానికి అంబులెన్సులు లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి 108 సేవలను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య ఉంటే తెలియజేయండి



పేద రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 108 వాహనాలను నడుపుతున్నాం. మొత్తం 16 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. వాహనాలకు సంబంధించి ఏ సమస్య ఉన్నా రోగులకు తమకు తెలియజేయవచ్చు.

– ఎం.సురేష్, జిల్లా మేనేజర్.

ఆదిలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి



ఆదిలక్ష్మి అలంకరణలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు



శ్రీ లలితా దేవిగా శ్రీ కన్యకా పరమేశ్వరి

డాబాగార్డెన్స్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం కనకమహాలక్ష్మి అమ్మవారు ఆదిలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజ నిర్వహించారు. అలంకరణకు నగరానికి చెందిన ఆర్.గణేశ్వరరావు రూ.35వేల రుసుం చెల్లించి పూజలో పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు చీరలు లక్కీ షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అందజేసింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు. మహోత్సవాల్లో భాగంగా బుధవారం కనకమహాలక్ష్మి ధనలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వనున్నారని, లక్ష చామంతులతో పూజ నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు.

గాయత్రిదేవి అలంకరణలో..

మద్రిపాలెం : శరన్నవరాత్రులను పురస్కరించుకుని రెండో రోజు మంగళవారం దుర్గమ్మ శ్రీ గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు 51వ వార్డు మాధవధార సీతన్న గార్డెన్స్‌లో కొలువైన కనకమహాలక్ష్మి, గాయత్రిదేవి, కనకదుర్గా ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సీతన్న గార్డెన్స్‌లో గాయత్రిదేవి రూపంలో అమ్మవారు

దంచి కొట్టిన వాన





మహారాణిపేట: నగరంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం వల్ల వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత దాదాపు 40 నిమిషాల పాటు కుండపోతగా వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రైల్వే స్టేషన్ రోడ్డు, డాబాగార్డెన్స్, రైల్వే న్యూ కాలనీ, ఆశీల్‌మెట్ట, దొండపర్తి, చావులమదుం, అక్కయ్యపాలెం, వెలంపేట, పూర్ణా మార్కెట్, కంచరపాలెం, ఎన్ఏడీ కొత్త రోడ్డు, పాత పోస్ట్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. వర్షం కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

వీధి విక్రయదారుల గుర్తింపునకు చర్యలు

జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి

అల్లిపురం: అర్హులైన వీధి విక్రయదారులను గుర్తించి వారికి వ్యాపార అవకాశాలు, జీవనోపాధి ప్రయోజనాలు కల్పించే దిశగా జీవీఎంసీ చర్యలు చేపట్టిందని యూసీడీ పీడీ పీఎం సత్యవేణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ దిశగా ఇప్పటికే జోనల్ కార్యాలయాల్లో స్ట్రీట్ వెండింగ్ కమిటీ సభ్యులతో జోనల్ కమిషనర్లు సమావేశాలు నిర్వహించారన్నారు. ఆపరేషన్ లంగ్స్ ఉద్దేశాన్ని స్ట్రీట్ వెండింగ్ కమిటీ సభ్యులకు వివరించారని తెలిపారు. నగరంలో పట్టణ ప్రణాళికా విభాగం ద్వారా ఇప్పటికే నగరంలో 21 విక్రయ జోన్లను గుర్తించి ప్రభుత్వానికి నివేదించామని, అదనంగా మరిన్ని విక్రయ జోన్ల గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా ఆక్రమణల తొలగింపు విషయమై ఎటువంటి అపోహలు, వదంతులు, అసత్య ప్రచారం నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

నేడు జోనల్ కార్యాలయాల వద్ద ధర్నాలు

సిటు పిలుపు

డాబాగార్డెన్స్: తోపుడు బండ్లు, వీధి విక్రయదారులపై వెంటనే దాడులు ఆపాలంటూ బుధవారం అన్ని జోనల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలని సిటు పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటూ కార్యాలయంలో విశాఖపట్నం తోపుడుబండ్లు, చిల్లర వర్తక కార్మిక సంఘం సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సిటు జిల్లా కార్యదర్శి సింహాచలం మాట్లాడుతూ అన్ని జోన్ల పరిధిలో తోపుడు బండ్లు, బడ్డీలకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే తొలగిస్తూ వేలాది మంది చిల్లర వర్తకులను రోడ్డుపాల్జేశారన్నారు. తక్షణం తొలగించిన తోపుడుబండ్లు, బడ్డీలను అదే స్థలంలో కొనసాగించాలని, ధ్వంసం చేసిన బండ్లు, బడ్డీలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిటు జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం ఉండగా, తోపుడుబండ్లు, బడ్డీ కార్మికులపై దాడులు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సిటు మధురవాడ జోన్ నాయకుడు పి.రాజ్‌కుమార్, పి.వెంకట్రావు, పి.మూర్తి, వరలక్ష్మి, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిటు జిల్లా కార్యదర్శి సింహాచలం

గంజాయి రవాణా అడ్డుకట్టకు ఉమ్మడి వ్యూహం

సాక్షి, విశాఖపట్నం : ప్రాంతీయ భద్రత, శాంతిభద్రతలను పెంపొందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్, ఒడిశా పోలీసుల మధ్య జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంతర్–రాష్ట్ర సమన్వయ సమావేశం జరిగింది. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల సీనియర్ పోలీసు అధికారులు సరిహద్దు సమస్యలు, ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణాపై చర్చించారు. గత కొన్నేళ్లుగా గంజాయి సాగు గణనీయంగా తగ్గిందని, 2021–22లో 7,515 ఎకరాల నుంచి 2024–25లో 93 ఎకరాలకు తగ్గిందని విశాఖ రేంజ్ పోలీసులు తెలిపారు. గంజాయి సాగు చేసే రైతులకు ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించడానికి చేపట్టిన చర్యలను వివరించారు. ఈ ఏడాది గంజాయి అక్రమ రవాణాలో 377 కేసులు నమోదు చేసి, 22,207 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇరు రాష్ట్రాల మధ్య నిరంతర సహకారం, సమాచార మార్పిడిని కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో కోరాపుట్ సౌత్ వెస్టర్న్ రేంజ్ డీఐజీ కన్వర్ విశాల్ సింగ్, రాయగడ ఎస్పీ ఎం. స్వాతి ఎస్ కుమార్, కోరాపుట్ ఎస్పీ రోహిత్ వర్మ, మల్కాన్‌గిరి ఎస్పీ హెచ్. వినోద్ పాటిల్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్



మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ స్థాయిలో క్లీన్ ఎనర్జీ రంగంలో అగ్రగామిగా నిలపడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సాగర్ నగర్‌లో రూ. 13.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆధునిక సూపర్ ఈసీబీసీ భవనాన్ని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్‌గా మార్చాలని అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రాజెక్టును మొదట బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ నుంచి రూ. 5 కోట్ల గ్రాంట్‌తో ప్రారంభించారు. భవిష్యత్ ఖర్చులను ఏపీ డిస్కాంలు, ఏపీజెన్కో, ఏపీట్రాన్స్‌కోతో కలిసి భరించనున్నాయి. ఈ కేంద్రం కేవలం ఒక పరిశోధనా సంస్థగా మాత్రమే కాకుండా, విద్యుత్ రంగంలో ఇన్నోవేషన్, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లకు ఒక వేదికగా పనిచేయనుంది. ఇది ఒక రిజిస్టర్ సొసైటీగా ఏర్పాటై, పరిశ్రమలు, విద్యాసంస్థలు, థింక్ ట్యాంకులు కలిసి పనిచేయడానికి అవకాశం కల్పిస్తుంది.

పునరుత్పాదక శక్తి, స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీలు, ఈవీ చార్జింగ్, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాలపై పరిశోధనలు చేస్తుంది. ఇంజనీర్లు, టెక్నీషియన్లకు సర్టిఫికెట్ కోర్సులు, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఫెలోషిప్‌లు అందిస్తుంది. స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్, పరిశ్రమ నిపుణులతో మెంటార్‌షిప్, నిధుల సేకరణకు మద్దతు ఇస్తుంది. ఈ సొసైటీ జనరల్ బాడీకి ఛైర్మన్‌గా ఎనర్జీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారు. ఈ కేంద్రం స్థాపనతో విశాఖ దేశవ్యాప్తంగా 'క్లీన్ ఎనర్జీ ఇన్నోవేషన్ హబ్'గా గుర్తింపు పొందనుంది.

మంచినీళ్లు అడిగి పుస్తెల తాడు చోరీ

అల్లిపురం: మంచి నీళ్లు కావాలని అడిగి ఓ మహిళ మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడును అపహరించిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు. ఈ ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లలపాలెం శివాలయం వద్ద చోటు చేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో హైమావతి అనే మహిళ తన ఇంటి ముందు పని చేసుకుంటుండగా, ఖమ్మం జిల్లాకు చెందిన టి. జీవరత్నం ఆమె వద్దకు వచ్చాడు. మంచి నీళ్లు కావాలని అడగడంతో, ఆమె లోపలికి వెళ్లి నీళ్లు తెచ్చింది. ఇదే అదునుగా భావించిన జీవరత్నం.. హైమావతి మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడును తెంపేసి పారిపోయాడు. ఈ హఠాత్ పరిణామానికి షాకై న హైమావతి వెంటనే కేకలు వేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ క్రైమ్ ఎస్.ఐ. సునీల్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. పోలీసులు వెంటనే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మాటు వేసి నిందితుడైన జీవరత్నాన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి చోరీకి గురైన రెండు తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును వేగంగా ఛేదించిన పోలీసులను స్థానికులు అభినందించారు.


అప్రెంటిస్ నియామక పత్రాల అందజేత



అభ్యర్థులతో జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: 2025–26 సంవత్సరానికి సంబంధించి డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) ట్రేడుల్లో ఉత్తీర్ణులైన ఐటీఐ అభ్యర్థులకు ఏపీఎస్ ఆర్టీసీ విశాఖ జిల్లాకు చెందిన వివిధ డిపోలలో అప్రెంటిస్ నియామక పత్రాలను జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైన ప్రతి అభ్యర్థి అంకితభావంతో, నిబంధనలకు అనుగుణంగా తమ విధులు నిర్వర్తించాలని కోరారు. అప్రెంటిస్‌లకు నెలకు రూ7 వేలు స్టైఫండ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి. శ్రీధర్ పాల్గొన్నారు.

అఖిల భారత న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌కు శివ సింహాద్రియాదవ్



విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘానికి చెందిన న్యాయవాది శివ సింహాద్రి యాదవ్ జాతీయ అఖిల భారత న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్‌నకు ఎన్నికయ్యారు. ఈమేరకు సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ పోటీలు న్యూఢిల్లీలో జరుగుతాయి. శివ సింహాద్రి యాదవ్ ఎంపిక పట్ల న్యాయవాదులు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయమూర్తులు అభినందించారు.

సాగరగిరి బోటుకు పోటెత్తిన భక్తులు



ఫెర్రీపై రాకపోకలు సాగిస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని సాగర గిరి కనకదుర్గ దేవాలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సాగర గిరి కనకదుర్గ ఆలయానికి నగరం నుంచి వెళ్లాలంటే సాగరాన్ని దాటాల్సి ఉంటుంది. అక్కడికి చేరుకోవడానికి నగరం నుంచి రోడ్డు మార్గం లేదు. పోర్టు అథారిటీ అనుమతితో బోటు సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ పాత పోస్టాఫీస్ దరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఫెర్రీ నుంచి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బోటు సౌకర్యం కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం సాగరగిరి కనకదుర్గ దేవాలయానికి వెళ్లేందుకు భక్తులు పోటెత్తారు.